www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 5 జులై 2024
5
చిత్తూరు



నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం



ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 5వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు నగర మేయర్ ఎస్ అముద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పాలక కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ప్రారంభ మయ్యే ఈ సమావేశానికి ఎక్స్ అఫీషియో సభ్యులు, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు హాజరు కావాలన్నారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

విద్యా సంస్థల బంద్ సక్సెస్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: నీట్ పేపర్ లీకేజీపై చర్యలు తీసుకోవాలని గురువారం చేపట్టిన బంద్‌కు కళాశాల విద్యార్థి ని విద్యార్థులు సంపూర్ణ మద్దతు తెలిపారని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వినోద్ కుమార్ అన్నారు. ఆయన మాట్లా డుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ని రద్దు చేయాలని ఇది ఎందరో యువతీ యువకుల జీవితాలను నాశనం చేస్తోందని దీనిపై రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని నీట్, నెట్ పరీక్షల్లో అక్రమాలకు అధిక సంఖ్యలో చోటు చేసుకుంటున్నాయని దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘ కార్యదర్శి శంకరన్, జిల్లా ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేష్, హిమగిరి , శరవణ పలువురు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: నీట్, యూజీసీ నెట్ పేపర్ లీకేజీల నిర్లక్ష్యానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని గురువారం చేపట్టిన దేశ వ్యాప్త విద్యా సంస్థల బంద్ విజయవంతమైందని ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా కన్వీనర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య విద్యతో వ్యాపారం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం తమ వైఖరిని మార్చుకొని పేద మధ్య బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే పద్ధతులలో పేపర్ లీకేజీలు చేస్తున్న ఆ పరీక్షను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తక్షణమే నీట్ పరీక్షను రద్దు చేస్తూ నీట్ పరీక్ష నిర్వహించిన ఎన్‌డిఏ ఈ సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ స్థాయి పరీక్షలను నిర్వహిం చడంలో విఫలమైందని తీవ్రమైన అవకతవకలు, వ్యత్యా సాలతో, బాధ్యతా రాహిత్యంతో పరీక్షలు నిర్వహిం చారు. నీట్ పరీక్షా లీకేజి తెరవెనుక కుంభకోణం, నీట్ స్కామ్‌పై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సురేష్, రోహిత్ విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్తూరు డెస్క్: నీట్ పరీక్షను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం శాసన సభలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయాలని ఏఐఎస్ఎఫ్ నగరి నియోజకవర్గ కన్వీనర్ విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో భాగంగా నగరి పట్టణంలో విద్యాసంస్థలు బంద్‌ను పాటించాయి. ఇందులో భాగంగా విద్యార్థి సంఘాలు కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షలను రద్దు చేయాలని కోరుతూ పట్టణ పరిధిలో ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. వీరికి ఏఐటీయూసీ నాయకులు కోదండయ్య, బాషా, సత్తార్, శేఖర్, సిరాఉద్దీన్ సంఘీభావం తెలిపారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు రాబిన్, రోహిత్, విశాల్, ముని పాల్గొన్నారు.



చిత్తూరులో



నగరిలో



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

అల్లూరి సీతారామరాజు జీవితం

ఆదర్శప్రాయం : కలెక్టర్

ప్రజాశక్తి-గుడిపల్లి:

అల్లూరి సీతారామరాజు చూపిన బాట మనకు ఆదర్శప్రాయమని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు.అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ గురువారం పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్ర మహా సంగ్రామంలో మహోజ్వల శక్తిగా వెలుగొందారని, పీడిత గిరిజన ప్రజలను స్వతంత్ర సంగ్రామానికి సమాయత్తం చేసిన ఆ మహనీయుడిని స్ఫూర్తితో మనం పురోగమించాలన్నారు. కొండలు, అడవులలో తిరుగుతూ గిరిజనుల జీవన విధానాన్ని గమనిస్తూ ఉండేవారని, కవిత్వంతో పాటు సంస్కృతం, ఆయుర్వేదం కూడా నేర్చుకున్నారన్నారు. ఆ రోజుల్లో ఏజన్సీ ప్రాంతంలోని ప్రజలు తెల్లదొరల చేతిలో అనేక దురాగతాలకు, దోపిడీలకు, అన్యాయాలకు గురయ్యేవారని, శ్రమదోపిడి, ఆస్తుల దోపిడి, స్త్రీల మానహరణం సర్వసాధారణంగా జరుగుతూ ఉండేవని, మన్యంలో గిరిజనుల జీవితం దుర్భరంగా ఉండేవన్నారు. మన్యం వాసుల కష్టాలను కడతేర్చటానికి, తెల్లదొరల దోపిడీని ఎదుర్కోవడానికి గిరిజనులకు అండగా నిలిచి పోరాటం చెయ్యాలని నిర్ణయించుకున్నారన్నారు. గిరిజన ప్రజల అభ్యున్నతి కి పాటుపడిన అల్లూరి సీతారామరాజు 27 ఏళ్ల వయసులోనే అమరవీరుడయ్యాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుప్పం ఆర్‌డిఓ శ్రీనివాసులు, డ్వామా పీడీ రాజశేఖర్, డిఆర్‌డిఎ పీడీ తులసి పాల్గొన్నారు.

ఉత్తమ వైద్యం అందించాలి

ఆర్‌విఎస్ ఆస్పత్రి సిబ్బందికి డిఎంఅండ్‌హెచ్‌వో ఆదేశం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: పేద ప్రజలకి ఆరోగ్యశ్రీ ద్వారా ఉత్తమమైన ఉచిత వైద్యం అందించాలని డిఎంఅండ్‌హెచ్‌వో ప్రభావతి దేవి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి దేవి చిత్తూరు నగర పరిధిలోని ఆర్‌విఎస్ ఆస్పత్రిని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి ఆస్పత్రి పని తీరు, వార్డులు, ఆపరేషన్ థియేటర్, డెలివరీ రూమ్స్‌ను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్వీఎస్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్‌విఎస్ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డిఎంఅండ్‌హెచ్‌ఒ ప్రభావతి దేవి

రెవెన్యూ సమస్యలు పరిశీలించి పరిష్కరించండి

- అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు చేరాలి
- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 600 వినతులు
- రెవెన్యూకు అత్యధికంగా 436 ఫిర్యాదులు
- కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -గుడిపల్లి:

రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులను సంబంధిత మండలాల తహశీల్దార్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిష్కారించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. ఎంఎల్ సి కంచర్ల శ్రీకాంత్ తో కలసి కుప్పం ఎంపిడిఓ కార్యాలయంలో గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను కలెక్టర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేసి పి శ్రీనివాసులు, డ్వామా, డిఆర్డిఏ పిడి లు ఎన్. రాజశేఖర్, తులసి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి 600 వినతులు అందగా అందులో అత్యధికంగా 436 రెవెన్యూ సంబంధిత వినతులు అందాయన్నారు. వీటితో పాటు డిఈఓ 5, ఆర్‌టిఐ 2, ఎస్ ఈ ఇరిగేషన్ 3, డిఆర్‌డిఏ పీడీ16, ఎంపిడి ఓ 15, డిఎస్ఓ 18, హెచ్ఎన్ఎస్ఎస్ 3, ఈడిబిసి వెల్ఫేర్ 1, పీడీ హౌసింగ్ 27, ఎస్ఈఆర్ అండ్ బి 2, దేవాదాయశాఖ 3, వికలాంగుల సంక్షేమ శాఖ 3, డిప్యూటీ ఈ ఓ 1, డి ఎల్ డి ఓ 3, సబ్ రిజిస్టర్ 1, పిడి ఐసిడిఎస్ 1, డ్వామా 2, ఈడి ఎస్ఇ కార్పొరేషన్ 1, జిల్లా ఉపాధి కల్పన అధికారి 1, సైనిక్ వెల్ఫేర్ 1, పి ఓ ఎస్ ఎస్ ఏ 1, ఎస్ ఈ మైన్ ఇరిగేషన్ 1, ఎస్ ఈ పి ఆర్ 29, డి పి ఓ 4, డి సి హెచ్ ఎస్ 1, ఏ పి ఎస్ఆర్‌టిసి 4, ఎం డి రెస్కో 4, ఏ డి అగ్రికల్చర్ 1, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ హాస్టల్స్ 1, డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ 1, పోలీస్ శాఖకు 8 వినతులు అందాయన్నారు. రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులను సంబంధిత తహశీల్దార్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు అందించే వివిధ సామాజిక పెన్షన్‌లకు అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ మంజూరుకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. వినతులు సమర్పించిన లబ్ధిదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి డిఎల్‌డిఓ రవి కుమార్, సిపిఓ సాంబశివ రెడ్డి, కుప్పం ఆర్‌డిఓ శ్రీనివాసులు, కుప్పం నియోజకవర్గ పరిధిలోని నియోజక వర్గ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



కుప్పంలో వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

బహిరంగ ధూమపానం, పొగాకు ఉత్పత్తుల

అమ్మకాలపై కఠిన చర్యలు

- ఎస్‌పి మణికంఠ చందోలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: బహిరంగ ప్రదేశంలో ధూమపానం చేసే వారిపై, విద్యా సంస్థలకి 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తులు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మార్గనిర్దేశంలో చిత్తూరు జిల్లా పోలీసులు గురువారం ప్రతిజ్ఞ చేశారు. సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టాన్ని అమలు చేయడానికి, జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం, రాష్ట్ర ప్రజా ఆరోగ్య శాఖ సంబంధ్ హెల్త్ ఫౌండేషన్ సహకారంతో జిల్లాలోని పోలీసు అధికారులకి చిత్తూరు లోని జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో కాన్ఫరెన్స్ హాల్లో సమగ్ర శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పొగాకుకు వ్యతిరేకంగా పోరాడటంలో వారి నిబద్ధతకు నిదర్శనంగా పోలీసు అధికారులందరూ పొగాకుకు వ్యతిరేకంగా పోరాడుతామని ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పొగాకు సంబంధిత వ్యాధుల కారణంగా రాష్ట్రంలో ప్రతి సంవత్సరం సుమారు 48 వేల మరణాలు సంభవిస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. ఈ శిక్షణా తరగతులు పోలీసు అధికారులకు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో సహాయపడుతుందన్నారు. కోప్టా చట్టం లోని సెక్షన్ 6 (బి) ప్రకారం విద్యాసంస్థలకి 100 యార్డులు (300 ఫీట్ల) పరిధిలో పొగాకు విక్రయించడం నిషేధం అని తెలిపారు. పెద్ద వయస్సుల వారు పొగాకు వ్యసనపు విషపు కోరల్లో చిక్కుకున్నప్పటికీ పిల్లల్ని పొగాకు వ్యసనపరులు కాకుండా రక్షించడం, వాళ్లని పొగాకు ఉత్పత్తులకు అలవాటు కాకుండా నిరోధించడం మన కర్తవ్యం అని తెలిపారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఏపీ పోలీసుల నిబద్ధతను అభినందిస్తూ, డాక్టర్ విజయానంద్ రెడ్డి, క్యాన్సర్ స్పెషలిస్ట్ డైరెక్టర్, అపోలో క్యాన్సర్ హాస్పిటల్, హైదరాబాద్, వాయిస్ ఆఫ్ టోబాకో విక్టిమ్స్ పాట్రన్ మాట్లాడుతూ, 90 శాతం నోటి , ఊపిరి తిత్తుల క్యాన్సర్లు నేరుగా పొగాకు ఉత్పత్తుల వాడకం వల్లే కారణం అవుతున్నాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పొగాకు వాడకాన్ని అరికట్టడంలో రాష్ట్రంలోని వైద్యులందరూ చేస్తున్న సమిష్టి కృషి కంటే పోలీసులు అమలు చేసే నివారణ చర్యలు ఎక్కువమంది ప్రాణాలను రక్షించగలవని ఆయన వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 20శాతం పెద్దలు (15 సంవత్సరాలు పైబడిన వాళ్లు) ఏదో ఒక రూపంలో పొగాకు ఉత్పత్తులను వినియోగిస్తున్నారన్నారు. ఆశ్చర్యకరంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సగటున రోజుకి 250 కంటే ఎక్కువ మంది పిల్లలు పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని ప్రారంభిస్తున్నారని, భారతదేశంలో సగటున రోజుకి 5,500 మంది పిల్లలు ప్రతిరోజు పొగాకు వాడకాన్ని ప్రారంభిస్తున్నారన్నారు. వీరిలో ఎక్కువమంది వాటికి బానిసలుగా మారుతున్నారని తెలిపారు. జువైనల్ జస్టిస్ చట్టంలోని సెక్షన్ 77 ప్రకారం ఎవరైనా మత్తు కలిగించే పదార్థాలు లేదా మద్యం లేదా పొగాకు ఉత్పత్తులు లేదా సైకోట్రోపిక్ పదార్థాన్ని కలిగిన ఉత్పత్తులని తగిన అర్హత కలిగిన వైద్యుల ఆదేశానుసారం తప్ప ఇంకా ఏ ఇతర సందర్భాల్లోనూ పిల్లలకు ఇచ్చినా , ఇవ్వడానికి కారణమైనా వారికి ఏడేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష, లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తారన్నారు. ఈ ప్రయత్నాలకు అనుగుణంగా ఎస్పీ చిత్తూరు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో 'నో స్మోకింగ్' బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కాట్పా చట్టం లోని సెక్షన్ -4 ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ ఎస్ ఆరిపుల్లా, డిటిసి సిఎస్పీ శ్రావణ్ కుమార్, సంబంధ్ హెల్త్ ఫౌండేషన్ మేనేజర్ ప్రమోద్ కుమార్, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టరు ప్రభావతి దేవి, జిల్లా లోని ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

తాగునీరు వృథా

స్పందించని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: నగరి పట్టణ సమీపంలోని డిగ్రీ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంక్ పైపులైను లీకేజి కారణంగా రెండేళ్లుగా తాగునీరు వృథాగా పోతోంది. నగరి మున్సిపాల్టీలో మొత్తం 23 వార్డులు 62 వేల మంది ప్రజలు నివసిస్తు న్నారు. వీరికి ప్రధానంగా తాగునీరు అందించ డానికి నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిధిలో ట్యాంకు ఏర్పాటు చేశారు. ట్యాంకు నుంచి పైప్ లైన్ ద్వారా పట్టణానికి తాగునీరు ఏర్పాటు చేస్తున్నారు. అయితే ట్యాంక్ కింద ఏర్పాటు చేసిన పైపు లీకేజ్ కావడంతో తాగు నీరు వృథాగా పోతోంది. ఆ వృథా నీరు పక్కనే ఉన్న డిగ్రీ కళాశాల మైదానంలో చేరడంతో మైదానం బురద మామంగా మారుతోంది. దీంతో క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రక్రియ గత రెండేళ్లుగా జరుగుతున్నా మునిసిపాల్టీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదు. గతంలో పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌తో పాటు సిబ్బందికి తెలిపారు. అయితే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరి స్తుండడంతో తాగునీరు వృథా అవుతోంది. ఒకప్పుడు తాగునీరు లేక నగరి పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడిన సందర్భాలు ఎన్నో వున్నాయి. ఇలాంటి పరిస్థితి రాకుండా మున్సిపాల్టీ అధికారులు తాగునీటి వృథాను అరికట్టాలని నగరి మున్సిపాల్టీ ప్రజలు కోరుతున్నారు.



పైపు లీకేజీతో బురదమయమైన డిగ్రీ కళాశాల గ్రౌండు

నాణ్యతలేకుంటే చర్యలు

బేకరీ తనిఖీలో జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హెచ్చరిక

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: నాణ్యత లేని ఆహార పదార్థాలు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అయ్యన్ నాగేంద్ర హెచ్చరించారు. రామ్ నగర్ కాలనీ మెయిన్ రోడ్డులో నిర్వహిస్తున్న ఓ బేకరీ అండ్ స్వీట్స్ షాపులో పాచిపోయిన, నాణ్యతలేని తినుబండారాలు విక్రయిస్తున్నారని దుకాణంలో పాచిపోయిన వెజిటబుల్ పఫ్ విక్రయించారని, దాన్ని తిన్న తన కుమారుడు మూడు సార్లు వాంతులు చేసుకున్నాడని రాంనగర్ కాలనీకి చెందిన బాలసుబ్రమణ్యం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. బాలసుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు బేకరీ అండ్ స్వీట్స్ దుకాణంలో గురువారం సాయంత్రం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అయ్యన్ నాగేంద్ర ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో తినుబండారాలు నాసిరకంగా ఉండటంతో దుకాణం నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు మూడు సంవత్సరాలుగా లైసెన్స్ లేకుండా దుకాణం నిర్వహిస్తుండడం, నాణ్యతలేని, పాచిపోయిన తినుబండారాల విక్రయాల విషయమై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నోటీసులు జారీ చేశారు. దుకాణ యజమాని నాగభూషణం లేకపోవడంతో నోటీసులను షాపు గోడలకు అంటించారు.



విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం

- ప్రజల్లో అవగాహన లోపం
- పర్యావరణానికి పొంచి ఉన్న ముప్పు

ప్రజాశక్తి- పూతలపట్టు: నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వినియోగం రోజురోజుకూ విచ్చలవిడిగా పెరుగుతూ ప్రజల జీవన శైలిలో ప్రతి పనిలో ప్లాస్టిక్ వాడకం సర్వసాధారణమైపోయింది. అధికారుల పర్యవేక్షణ లోపం, ప్రజలకు అవగాహన లేమి, నిర్లక్ష్యంతో పర్యావరణానికి తీవ్ర ముప్పు పొంచివుంది. కొన్నేళ్లుగా ప్లాస్టిక్ వస్తువులు ప్లాస్టిక్ కవర్లపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. అయినా ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా విక్రయాలు, వినియోగం జరుగుతున్నప్పటికీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం ప్లాస్టిక్ కవర్లను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్లాస్టిక్ ఉత్పత్తులు, విక్రయించడం, నిల్వ చేయడం పంపిణీ వినియోగాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వస్తువులు నిషేధం పరిధిలోకి వస్తాయని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వినియోగించిన ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు ప్లాస్టిక్ కవర్లు రోడ్లపై వేయడంతో గాలికి ఎగిరి మురుగునీటి కాలువల్లో పేరుకుపోయి వ్యర్థాలతో వాతావరణ కాలుష్యం పెరుగుతోంది. ఎక్కడపడితే అక్కడ రోడ్లపై ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు పారవేయడం, ప్రజల తప్పిదాలతో నోరులేని జీవాలు మృత్యువాత పడుతున్నాయి. పచ్చని పచ్చిక బయలులో పశుగ్రాసం తినాల్సిన ఆవులు చెత్త కుప్పల్లో ప్లాస్టిక్ పారేసిన, పాచిపోయిన ఆహారం కుళ్లిపోయిన పండ్లతో పాటు ప్లాస్టిక్ సంచులను తినేస్తున్నాయి. ఈ కారణంగా ప్లాస్టిక్ వ్యర్థాలు పశువుల పొట్టల్లో గుట్టలుగా పేరుకు పోయి అనారోగ్యానికి గురై మృత్యు వాత పడుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు తిని చనిపోయిన ఆవులను, పశువుల వైద్యులు పరిశీలించగా వాటి పొట్ట నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలు బయట పడుతున్నాయి. గ్రామాలలో స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులు అలంకార ప్రాయంగా మారాయి. నిషేధిత ప్లాస్టిక్ నిర్మూలనకు జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏకమై ప్లాస్టిక్ వినియోగ నిల్వల ప్రదేశాలు, విక్రయ దుకాణాలు, దిగుమతుల పంపిణీలపై దృష్టి పెడితే వినియోగం తగ్గించే అవకాశం వుంది. ప్లాస్టిక్ వినియోగించిన తక్షణమే జరిమానాలు విధించే విధంగా చర్యలు చేయబడితే తప్పనిసరిగా మార్పు వచ్చే అవకాశం ఉంది. అధికారులు నామమాత్రపు దాడులు నిర్వహించి జరిమానా విధించడంతో సరిపెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రధాన వీధులలో, హోటళ్లు, దుకాణాలు, సముదాయాల్లో ప్లాస్టిక్ వస్తువులు వాడకూడదని పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని బోర్డులు పెట్టి అవగాహన కల్పించాలి. ప్లాస్టిక్ వినియోగం మానవాళికి, పర్యావరణానికి వాటిల్లే ప్రమాదంపై అవగాహన కల్పించాలి. ప్లాస్టిక్ కవర్లు తయారీదారులు, అమ్ముతున్న వారిపై అధికారులు దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలి. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలిసి భూమి సారం తగ్గి పండే పంటలపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ప్లాస్టిక్ కవర్ల నిర్మూలనకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం వుంది.



రోడ్లపై పేరుకుపోయిన చెత్తకుప్పలు

ప్రజాశక్తి
www.prajasakti.com

బిసిజి వ్యాక్సిన్‌ల పంపిణీ



సచివాలయంలో బిసిజి వ్యాక్సిన్లు వేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని సబ్ సెంటర్లలో, సచివాలయాలలో గురువారం బిసిజి వ్యాక్సిన్లను 60 సంవత్సరాలు పైబడిన వారికి ఇంజక్షన్ రూపంలో అందించారు. వైద్యాధికారి ప్రదీప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు ప్రతి గురువారం బిసిజి వ్యాక్సిన్లను ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని సబ్ సెంటర్లలో, సచివాలయాలలో వేశామని, ఈ వ్యాక్సిన్ వేసుకున్న వారికి టిబి రాకుండా నివారించవచ్చునని తెలిపారు. వ్యాక్సిన్ వేసుకున్న తర్వాత ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సిహెచ్ఓ అమరనాథ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పి శాంభవి, ఎఎన్ఎంలు మదనిక, గుణవతి, శ్రీలత, నాగరత్న, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు ప్రపంచ 'జూనోసిస్ డే'ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - సదుం: ఈ నెల 6వ తేదీ శనివారం నిర్వహించనున్న 'ప్రపంచ జూనోసిస్ డే'ను ప్రజలు విజయవంతం చేయాలని సదుం వెటర్నరీ డాక్టర్ ఈ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీ ప్రఖ్యాత ఫ్రెంచ్ జీవశాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ జూనోటిక్ వ్యాధి అయిన రేబీస్ వైరస్‌కు మొట్ట మొదట వ్యాక్సిన్‌ను చిన్న పిల్ల వాడికి ఇచ్చి బాలుడు ప్రాణాలను కాపాడి వ్యాక్సిన్ విజయవంతమైన సందర్భంగా ప్రతి సంవత్సరం జులై 6న జూనోసిస్ డే ను ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా చెరుకు వారిపల్లి, సదుం పశువైద్య శాలల్లో కుక్కలకు ఉచితంగా టీకాలు వేస్తామని చెప్పారు. కుక్కలు వున్న యజమానులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సిమెంట్ గోల్ మాల్‌పై విచారణ చేయాలి

- సింగిల్ విండో మాజీ వైస్ ఛైర్మన్ జెగిని మునిక్రిష్ణారెడ్డి



మాట్లాడుతున్న మునిక్రిష్ణారెడ్డి

ప్రజాశక్తి- వెదురుకుప్పం: జిడి నెల్లూరు నియోజకవర్గం మాజీ డిఈతో నిర్మాణం వల్ల చాలా మందికి నాలుగు ఏళ్లుగా చిన్నపాటి బిల్లులు కూడా రాలేదని వాపోతున్నారని సింగిల్ విండో మాజీ వైస్ ఛైర్మన్ జెగిని మునిక్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన వెదురుకుప్పంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ అధికారితో పాటు వెదురుకుప్పం మండలంలోని ఓ పంచాయతీ రాజ్ అధికారి చేసిన అవినీతి వల్ల 8వేలకు పైగా సిమెంట్ బస్తాల లెక్కలు తేలక పోయేసరికి చిన్నపాటి కాంట్రాక్టర్లకు బిల్లులు రాలేదని వాపోతున్నారన్నారు. 8 వేల బస్తాల సిమెంట్ అధికారుల నుంచి రికవరీ చేసి న్యాయం చేయాలని లేక పోతే బాధితులతో కలిసి సోమవారం (గ్రీవెన్స్ డే)న కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. దీని కంతటికీ కారణం (డి రెడ్డి) అని అనుమానిస్తున్నామని బహిరంగంగా ఆరోపించారు.

సీఎంసి హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



ప్రజాశక్తి -చిత్తూరు డెస్క్: సిఎంసి హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించిందని సుచి సంస్థ డైరెక్టర్ గోరీ విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ పనిచేసే గ్రామీణ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా తెలిపారు. యాదమరి మండలం జోడి చింతల సుచి కార్యాలయం నందు వేలూరు సిఎంసి బ్రాంచ్ చిత్తూరు సిఎంసి హాస్పిటల్ వైద్య సిబ్బంది ద్వారా ఉచిత ఫిజికల్ మెడిసిన్ రిహాబిలిటేషన్ అంగవైకల్యం మహిళలకు క్యాన్సర్ జనరల్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంపుకు 150 మంది హాజరయ్యారు ఈ సందర్భంగా అన్ని వ్యాధులకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అశ్విన్, కమ్యూనిటీ మెడిసిన్స్ డాక్టర్ విలిష, కమ్యూనిటీ మెడిసిన్ డాక్టర్ నవీన్, పీఎంఆర్ డాక్టర్ జోష్నా అక్సెసెల్, థెరపిస్ట్ డాక్టర్ సంధ్య ఫిజియోథెరపీ నర్సులు ఫ్లేమి యానియ, వసంత, వాణి, ఆసిస్ సోషల్ వర్కర్ వివిధ రోగులకు సంబంధించిన చికిత్సలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. చికిత్స చేసి ఎంపిక చేసిన రోగులను సిఎంసి ఆసుపత్రికి రిఫరల్ చేసినట్లు డాక్టర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుచి సిబ్బంది ధనలక్ష్మి జాన్సన్, వరదరాజులు జాకబ్, థామస్, డి చిన్నయ్య ఎంఎస్ మని పాల్గొన్నారు.

స్టేడియంను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-గుడిపల్లి : కుప్పంలోని ఎన్టీఆర్ ఇండోర్ ఔట్ డోర్ స్టేడియం ను కలెక్టర్ సుమిత్ కుమార్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎస్ పి మణికంఠ చందోలుతో కలిసి గురువారం సాయంత్రం పరిశీలించారు. ఎన్టీఆర్ ఇండోర్, ఔట్ డోర్ స్టేడియంలోని వసతులను పరిశీలించి క్రీడాకారులు ఆడుకునేందుకు వీలుగా మైదానాన్ని సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, కుప్పం ఆర్డీవో శ్రీనివాసులు, నాయకులు మునిరత్నం, డాక్టరు సురేష్, సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఈ తరానికి ధైర్యం, మార్గదర్శం, రేపటి తరానికి ఆదర్శం బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన రంగా అని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అన్నారు. గురువారం వంగవీటి మోహనరంగ 77వ జయంతిని పురస్కరించుకొని స్థానిక గాంధీ విగ్రహం ఎదుట వంగవీటి మోహన రంగ చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రజలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాంపస్ రిక్రూట్‌మెంటులో 136 మంది ఎంపిక

ప్రజాశక్తి -శాంతిపురం: మండల పరిధిలోని తుమిసి ప్రభుత్వ ఐటిఐ లో గురువారం నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్లో 136 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నగేష్ తెలిపారు. ఈ రిక్రూట్మెంట్ మెంటులో ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ క్యాంపస్ డ్రైవ్‌లో 166 మంది శిక్షణ విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో 136 శిక్షణ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కుక్కలకు ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు

ప్రజాశక్తి -సోమల: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 6 వ తేదీన పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమల మండలంలోని కుక్కలకు ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు వేయనున్నామని సోమల పశుసంవర్ధక శాఖ ఏడి శ్రీనివాసులు నాయుడు తెలిపారు. సోమల పశువైద్యశాలలో, పెద్ద ఉప్పరపల్లి, కందూరు పశు వైద్యశాల వద్ద ఉచితంగా టీకాలు వేయడానికి ఏర్పాట్లు చేసినట్టు ఆయన వెల్లడించారు.

టిడిపి అధ్యక్షుడికి సన్మానం

ప్రజాశక్తి - రామకుప్పం: టిడిపి మండల అధ్యక్షుడు ఆనందరెడ్డినీ నాయి బ్రాహ్మణులు ఘనంగా సన్మానించారు. గురువారం టిడిపి నాయి బ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో దుశ్శాలువా, పూలమాలవేసి సత్కరించారు. నాయి బ్రాహ్మణులకు ప్రభుత్వం ద్వారా విరివిగా పథకాలను అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మనోహర్, గంగాధర్, సీనప్ప, శరవణ, వంశీ , వెంకటరమణ, కుమార్, జగదీష్ పాల్గొన్నారు.

రాణెమ్మకు నివాళి

ప్రజాశక్తి -వెదురుకుప్పం : వెదురుకుప్పం మండలం, తిప్పినాయుడు పల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ తల్లి రాణెమ్మ, అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. గురువారం ఆమె కర్మ క్రియలకు, హాజరైన ఎస్ ఆర్ పురం మండలానికి చెందిన మాజీ వాటర్ షెడ్ ఛైర్మన్ గుణశేఖర్ నాయుడు ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

రోడ్ల మరమ్మతులకు శ్రీకారం

ప్రజాశక్తి- పెద్దపంజాణి: ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి ఆదేశాల మేరకు లింగాపురం పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి నుంచి దాసినంపల్లి వరకు మట్టి రోడ్డుకి మరమ్మతులు చేపడుతున్నట్లు పంచాయతీ సర్పంచ్ రుద్ర మూర్తి నాయుడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో రోడ్లన్నీ గుంతల మయంగా మారాయని టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ నాయకులు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి ఆదేశాలతో కంపచెట్లు తొలగించి రోడ్డు విస్తరణ చేసి మట్టి తోలుతున్నట్టు ఆయన తెలిపారు. లింగాపురం పంచాయతీ పరిధిలో ప్రతి గ్రామానికి రోడ్డు మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు.

దహన సంస్కారాలకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - తవణంపల్లి: నల్లపరెడ్డి పల్లెలో కె కాళేమ్మ మరణ వార్త తెలుసుకున్న జీ కరీం ప్రస్తుతానికి తాను అందుబాటులో లేని కారణంగా వారికి పైమాఘం టి ప్రశాంత్ కుమార్, పైమాఘం బాబు ద్వారా ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో అరగొండ పైమాఘం టి ప్రశాంత్ కుమార్, పైమాఘం బాబు, నల్లపరెడ్డి వార్డ్ మెంబెర్ నాగరాజ గ్రామ పెద్దలు పి మణి, యం హరి మార్కొండయ్య పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు అందని పాఠ్యపుస్తకాలు


ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఇంటర్ విద్య శాఖ అందించాల్సిన పాఠ్యపుస్తకాలు ఇంతవరకు కళాశాలకు చేరక పోవడంతో విద్యార్థులకు అందని పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది కళాశాలలో మొదటి సంవత్సరం 60 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 112 మంది విద్యార్థులు వివిధ గ్రూపులలో విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరికి నూతన ప్రభుత్వం తెలుగు అకాడమీ ద్వారా పాఠ్య పుస్తకాలతో పాటు విద్యార్థుల కిట్‌లు అందజేసే ఆలోచనలో ఉన్నట్లు ఇప్పటికే విద్యా శాఖ మంత్రి లోకేష్ ప్రకటించారు. అయితే కళాశాల తెరచి రోజులు గడుస్తున్నా ఇంత వరకు విద్యార్థులకు ఎలాంటి పాఠ్య పుస్తకాలు అందని పరిస్థితి ఏర్పడింది. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్ గంగాధరనాయుడుని వివరణ కోరగా పాఠ్యపుస్తకాల అవసర నిమిత్తం ఇండెంట్ ఇంటర్ విద్యాశాఖకు పంపించామని పాఠ్యపుస్తకాలు సరఫరా కాగానే విద్యార్థులకు ఆలస్యం లేకుండా అందిస్తామని తెలిపారు. పాఠశాలల స్థాయిలో అందించిన విధంగానే పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగులను సాధ్యమైనంత త్వరగా అందిస్తే విద్యార్థులు చదువుకోడానికి, అధ్యాపకులు బోధించేందుకు అవకాశం ఉంటుంది. కాగా గతంలో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉండగా ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేవారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం మధ్యాహ్న భోజనాన్ని ఇంటర్ విద్యార్థులకు రద్దు చేయడంతో ప్రస్తుతం మధ్యాహ్న భోజనాన్ని కళాశాల విద్యార్థులకు అందించలేని పరిస్థితి ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులు ఉదయం తొమ్మిది నుండి సాయంత్రం ఐదు గంటల వరకు కళాశాలలోనే ఉండాల్సిన పరిస్థితి వుంది. నూతన ప్రభుత్వం కళాశాల విద్యార్థులకూ పాఠశాల విద్యార్థులకు అందించిన విధంగానే మధ్యాహ్నం భోజనం అందించాలని విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అధికారుల వివరణ : కళాశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, 12 నోట్ బుక్‌లు, స్కూల్ బ్యాగ్‌లు ఇవ్వనున్నట్టు సర్క్యులర్ గురువారం 3.30 గంటలకు అందిందని అధికారులు తెలిపారు.

కేంద్ర హోంమంత్రిని కలిసిన సిఎం, ఎంపి

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతత్వంలో సహచర పార్లమెంటు సభ్యుల బృందంతో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను గురువారం కలిశారు . చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద్ రావు ఈ సందర్భంగా అమిత్ షా కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిత్తూరు ఎంపీ మాట్లాడుతూ... నవ్యాంధ్ర అభ్యున్నతి కోసం ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ప్రధాని మోడీ తో జరిగిన భేటీలో సీఎం చంద్రబాబు ప్రధానంగా అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలకు ఆండగా నిలవాలని కోరినట్లు చెప్పారు. అనంతరం కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్ ను కలిసి ఏపీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారని తెలిపారు. మధ్యాహ్నం 12.15 గంటలకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతోనూ, 2 గంటలకు వ్యవసాయ, గ్రామీణాభివద్ధిశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తోనూ, మధ్యాహ్నం 2.45 గంటలకు హోం మంత్రి అమిత్‌షాతోనూ సీఎం చంద్రబాబు భేటీ అయ్యారని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన కొనసాగిందని ఆయన తెలిపారు. పార్లమెంటు సభ్యులంతా తమ అధినేత బాబు పర్యటనలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని ప్రసాదరావు పేర్కొన్నారు.

అల్లూరి జీవితం యువతకు ఆదర్శం



అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఢిల్లీలో మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో సహచర పార్లమెంటు సభ్యులతో కలిసి, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద రావు పాల్గొని, అల్లూరి చిత్రపటానికి పుష్పాలు సమర్పించి ఘన నివాళులు అర్పించారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు దేశభక్తిని ఎంపి కొనియాడారు. ఆధునిక సమాజానికి అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిగా నిలుస్తారని తెలిపారు. తమ అధినేత , ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు తో కలిసి మన్యం వీరుడికి ఘన నివాళులర్పించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అల్లూరి వారి బాటలో నడిచి సమాజ సేవకు అంకితం అవుతామని ఎంపి పిలుపునిచ్చారు.

చిత్తూరు అర్బన్ : జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఎస్ కె.రబ్బానీ బాషా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి నివాళు లర్పించారు. కలెక్టరేట్‌లో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి ఎస్ మూర్తి, భూగర్భ జలాలు శాఖ డి డి గంగాధర్ రెడ్డి, గృహ నిర్మాణ సంస్థ పీడీ పద్మనాభం, జిల్లా మత్స్య శాఖ ఏడీ రవీంద్ర రెడ్డి లతో కలసి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల, గిరిజన, సాంఘిక సంక్షేమ, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరులోని పివికెఎన్ ప్రభుత్వ కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. హిస్టరీ లెక్చరర్ రెడ్డి బాషా, , ఎకనామిక్స్ లెక్చరర్లు కోటేశ్వరావు, రాజేష్ కీలక సహకారంతో బిఎ వింగ్ ఇన్‌చార్జి గోపినాయక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బిఎవింగ్ ఇన్‌ఛార్జ్ గోపినాయక్ సీతారామరాజు గొప్పతనాన్ని వివరించారు. అల్లూరి సీతారామరాజు గొప్ప వారసత్వం, శౌర్యాన్ని చాటిచెప్పే సంప్రదాయ పాటలు, నృత్యాలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమంతో కార్యక్రమం ముగిసింది. విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సోమల: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం నేటి యువత ఆదర్శంగా తీసుకొని ఆయన విప్లవ భావాలను అలవర్చుకోవాలని పోరాట పటిమను పెంపొందించుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గౌతమ్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతిని సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్ర పటానికి పూల మాలవేసి విద్యార్థులకు ఆయన జీవిత చరిత్ర గురించి, పోరాట పటిమ గురించి వివరించారు. చరిత్ర అధ్యాపకులు రామకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్రం కోసం పోరాడిన అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ వారికి ముచ్చెమటలు పట్టించారని కొనియాడారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకొని దేశభక్తిని పెంపొందించుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: అల్లూరి సీతారామరాజు జీవితం యువతకు ఎంతో ఆదర్శమని ప్రభుత్వ డిగ్రీకళాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. గురువారం అల్లూరు సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు ధైర్య సాహసాలు, దేశ భక్తి నాయకత్వ లక్షణాలు నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు. అనంతరం ఎన్ ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనంజయరెడ్డి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు గారి జీవిత చరిత్రను డిజిటల్ రూపంలో విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం ఆచారి, అధ్యాపకులు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ హరిబాబు, డాక్టర్ బాబు,సరిత,కార్తీక్,రాజశేఖర్ విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని కళామందిర్ ఆధ్వర్యంలో గురువారం తెలుగు సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 127 వ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పుష్ప భారతి, కుమారి యశస్విని, సుశీలమ్మ పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అల్లూరి సీతారామరాజు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబురెడ్డి ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. 8వ తరగతి విద్యార్థి అల్లూరి సీతారామరాజు వేషధారణలో వచ్చి అల్లూరి సీతారామరాజు గురించి నాటకీకరణలో చెప్పిన డైలాగులు ఉపాధ్యాయులను విద్యార్థులందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మీనాక్షి, వాణిశ్రీ,మాధవన్,రాజేష్ బాబు,ఆంజప్ప పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలి: సర్పంచ్



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ ధనంజయవర్మ

ప్రజాశక్తి - కార్వేటినగరం : పంచాయతీ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని స్థానిక సర్పంచ్ ధనంజయ వర్మ కోరారు. కార్వేటినరం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన గ్రామ సభకు సర్పంచ్ ధనంజయ వర్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ధనంజయ వర్మ మాట్లాడుతూ కుమ్మరగుంట వద్ద సప్లై ఛానల్, బంగ్లా చెరువు నుండి కార్వేటినగరం చెరువుకు వెళ్లే కాలువను ఉపాధి హామీ లో పనులు చేపట్టాలని ఏపీవో జాహ్నవిని కోరారు. కాలువ పనులు చేస్తే నీళ్ల చెరువులోకి సులభంగా వెళుతుందని పేర్కొన్నారు. అక్కడక్కడ డ్రైనేజ్ కాలువలు దెబ్బతిన్నచోట మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఉపాధి ఏపీఓ జాహ్నవి మాట్లాడుతూ ఉపాధి హామీలో అందరికీ వంద రోజులు పనులు కల్పిస్తామని అన్నారు. ఏవో హేమలత మాట్లాడుతూ రైతులకు వేరుశనగ బస్తాలు, జనుము లు సబ్సిడీ ద్వారా పంపిణీ చేస్తామని తెలిపారు. కొత్త ప్రభుత్వంలో రైతు భరోసా గురించి ఇంకా వివరాలు రాలేదని సూచించారు. తాగునీటిని కాచి చల్లార్చి తాగాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని వైద్య పర్యవేక్షకులు త్యాగు తెలిపారు. ఎంఈఓ విజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులందరూ ప్రభుత్వ బడులల్లో చేర్పించేలా చూడాలని ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం ప్రభుత్వ పాఠశాలలో చదివి సీఎం స్థాయి వరకు వెళ్లారని వివరించారు. పంచాయతీకి సంబంధించిన నిధులు ఈవో మణి చదివి వినిపించారు. కొందరు లబ్ధిదారులు అర్జీలు సమర్పించారు. విద్యుత్ సమస్యలు ఎక్కువ ఉందని పలువురు గ్రామసభ దృష్టికి తీసుకొచ్చారు. ఈవో స్పందించి వచ్చే గ్రామ సభలోపు విద్యుత్ సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానం లేక ఇక్కట్లు!



ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: నియోజకవర్గ కేంద్రమైన గంగాధర నెల్లూరుకు కూత వేటు దూరంలో ఉన్న నీవానదిలో చికెన్ వ్యర్థాలు భారీగా పడవేయడంతో ఆ ప్రాంతం మొత్తం దుర్గంధ భరితంగా మారింది. గతంలో పలుసార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని నీవానది సమీప ప్రాంతంలోకి వెళ్లాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు. అధికారులు కల్పించుకొని చికెన్ వ్యర్థాలను వేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. గంగాధర నెల్లూరులో ఇప్పటివరకు ప్రత్యేకమైన శ్మశానానికి స్థలం కేటాయించకపోవడంతో గత ఎన్నో ఏళ్లుగా నీవా నదిలో అంత్యక్రియలు జరిపేవారు. అయితే నీవానదిలోకి వెళ్లడానికి రోడ్డు లేక మృతదేహాలను తరలించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గంగాధరనెల్లూరులోని ఒక వ్యక్తి దహన సంస్కారాలు నిర్వహించడానికి తీసుకెళ్తూ గురువారం స్వర్గరథం వెళ్లలేక చెత్త తరలించే వాహనంలో తరలించడం పట్ల మృతుడు కుటుంబ సభ్యులు తీవ్రంగా బాధపడ్డారు. సంబంధిత అధికారులు కల్పించుకుని గంగాధర నెల్లూరుకు ప్రత్యేకమైన శ్మశాన స్థలాన్ని కేటాయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

విధి నిర్వహణలో గుండెపోటుతో డ్రైవర్ మృతి

కుటుంబాన్ని ఓదార్చిన ఆర్టీసీ ఉన్నత అధికారులు

ప్రజాశక్తి -పుంగనూరు: విధి నిర్వహణలో ఉన్న పుంగనూరు ఆర్టిసిడిపో డ్రైవర్ గుండెపోటుతో బుధవారం రాత్రి మృతి చెందాడు. తిరుపతి నుండి భీమవరం మీదుగా కల్లూరు నైట్ హాల్ట్ బస్సు డ్రైవర్ బంట్రోతు రాఘవయ్య వస్తుండగా కల్లూరు కు 5 కిలోమీటర్ల సమీపంలో గుండెపోటు వచ్చింది. బస్సు నడుపుతుండగా గుండెపోటు రావడంతో సైడ్ గుంతలోకి వెళ్లి ఆగింది బస్సు. స్టీరింగ్ మీదడ్రైవర్ అలాగే వాలిపోవడంతో కండక్టరు, ప్రయాణికులు డ్రైవరును పులిచెర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించగా అప్పటికే మృతి చెందినట్లు వారు వైద్యులు నిర్ధారించారు. విధి నిర్వహణలో తనువు చాలించిన రాఘవయ్య డ్రైవర్ (ఇ .552840) మృతదేహాన్ని ప్రజా రవాణా సంస్థ, కడప జోనల్, కార్య నిర్వహణ అధికారి గిడుగు వెంకటేశ్వరరావు , చిత్తూరు జిల్లా ప్రజా రవాణా అధికారి టి. జితేంద్ర నాథ్ రెడ్డి , పుంగనూరు డిపో మేనేజర్ కె సుధాకరయ్యగ, డిపో సిబ్బంది అందరూ సోమల మండలం, పొదలపకుంట్లపల్లి గ్రామంలోని రాఘవయ్య స్వగృహంలో సందర్శించి ఘనంగా నివాళులు అర్పించినారు. వారి కుటుంబాన్ని ఓదార్చారు. సంస్థ తరపున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

సీఎం చంద్రబాబు ఫ్లెక్సీపై పేడ కొట్టిన అగంతకులు

ప్రజాశక్తి -శాంతిపురం: మండల పరిధిలోని కడపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పెంచిన నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫ్లెక్సీ పై బుధవారం రాత్రి కొంత మంది అగంతకులు ఫ్లెక్సీను పేడతో కొట్టిన సంఘటన చోటు చేసుకుంది. గురువారం ఉదయం పలువురు గ్రామస్తులు టిడిపి నాయకులు దీన్ని గమనించి రాళ్ళబుదుగురు పోలీసులకు, పంచాయతీ కార్యదర్శి కి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి కూడా ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. ఈ విషయంపై రాళ్ళబూదుగూరు పోలీసులు ఇద్దరు అనుమానిత వైసీపీ నేతలను స్టేషనుకు పిలిపించి విచారించినట్లు తెలిసింది. కేసు పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

విద్యాభివృద్ధికి కృషి..

ప్రజాశక్తి - రామకుప్పం: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి టిడిపి ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని టీడీపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని లింగాపురం, ఎస్ గొల్లపల్లి లోని జడ్పీ హైస్కూల్లో విద్యార్థిని, విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మంచి బోధన, మౌలిక సదుపాయాలు అందిస్తున్నారన్నారు. బడి ఈడు పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో యువత అధ్యక్షుడు విశ్వనాథ్, కోదండ రెడ్డి, నందా రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మురళి,సుబ్రహ్మణ్యం, మురుగేష్, పార్థసారథి, జయప్ప పాల్గొన్నారు.

క్రైం న్యూస్

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం బంగారుపాలెం మండలం నల్లగంపల్లి పంచాయతీ ఎన్ పి నగర్లో చోటు చేసుకుంది. ఏఎస్ఐ మల్లప్ప కథనం మేరకు గ్రామానికి చెందిన మొగులయ్య కుమారుడు చిరంజీవి (41) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇది భరించలేక గురువారం తన ఇంటిలోని కొక్కికి ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాలెం ప్రజా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని గొడుగుచింత గ్రామానికి చెందిన వెంకట ముని (32) రోడ్డు ప్రమాదంలో బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం నాయుడు మీడియాకు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఎ.వెంకటముని వెదురు కుప్పం నుంచి స్వగ్రామమైన గొడుగుచింతకు వెళుతుండగా ఆ గ్రామ సమీపంలో తను నడుపుతున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆయనను పచ్చికాపల్లం వరకు ఆటోలో తీసుకెళ్లారు. అటుపై 108 వాహనం ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతి దేహానికి తిరుపతి రుయాలో పోస్టుమార్టం నిర్వహించి. గురువారం బంధువులకు అప్పగించామని తెలిపారు. మృతునికి మూడు నెలల పాప వుంది. దీంతో బంధువుల అర్ధనాదాలు మిన్నంటాయి. ఆ గ్రామాంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న టెంపో..

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి -సోమల: ద్విచక్ర వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి ముగ్గురు యువకులు మాట్లాడుకుంటూ ఉండగా ఇరికిపెంట మార్గం నుండి సోమల వైపు వస్తున్న టెంపో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో ఆ ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రమైన సోమల పంచాయతీ రాజీవ్ నగర్ కాలనీ సమీపంలోని బూరగమాను వద్ద గురువారం చోటుచేసుకుంది. గాయపడ్డ వారిలో ఇద్దరు ఇరికిపెంట పంచాయతీ మేటి మంద గ్రామానికి చెందినవారని, మరొక యువకుడిది సోమల అని సమాచారం. వీరిలో తీవ్రంగా గాయపడిన ఒకరిని సోమల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఆపై మెరుగైన వైద్యం కోసం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులను సమాచారం కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి: సిపిఎం

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు పట్టణంలో గిరిధర్ గుప్త ఇల్లు విద్యుత్ ప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో ఉన్న అన్ని రకాల వస్తువులు కాలి బూడిద అయి రూ5 లక్షల మేర నష్టం వాటిల్లిందని ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. కాలిపోయిన ఇంటిని గురువారం పరిశీలించి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిధర్ గుప్తా సామాజిక కార్యకర్తగా ఉంటూ ప్రజా సమస్యలపై పనిచేస్తున్న వ్యక్తిగా గుర్తింపు వుందని, అతనికి భార్యతో పాటు కుమార్తె, తల్లి ఉన్నారని, పేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. కట్టు బట్టలు మాత్రమే మిగిలాయని, మిగతా అన్ని వస్తువులు కాలి బూడిద అయ్యాయని తెలిపారు. పరామర్శించిన వారిలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేంద్రన్, ప్రసాద్, రామాంజులు, ధనలక్ష్మి, శ్రీరాములు, సంజయ్ ఉన్నారు.

పల్లెలో పారిశుధ్యం పనులు ముమ్మరం

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం కామిరెడ్డి వారి పల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాలలో పారిశుధ్య పనులు వేగవంతం చేశారు. లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శి లోకేష్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. పంచాయతీ పరిధిలోని గ్రామాలలో వ్యాధుల వ్యాప్తి నివారణకు పారిశుధ్య పనులు చేపడుతూ మురుగు నీటి కాలువలలో చెత్తా చెదారం తొలగించడం, పిచ్చి మొక్కలు తొలగింపు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఈఓఆర్డి మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్న ఉద్దేశంతో జిల్లా అధికారుల ఆదేశం ప్రకారం మండలంలోని అన్ని పంచాయతీలలో ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపరచడం, పారిశుధ్య పనులు చేపడుతున్నా మని అందులో భాగంగా కామి రెడ్డి వారి పల్లెలో పారిశుధ్య పనులను ముమ్మరం చేశామని ఆమె తెలిపారు.